ప్రజాశక్తి

బుధవారం 31 డిసెంబరు, 2025 9 పేజీలు

శ్రీకాకుళం

రేషన్ డిపోల్లో గోధుమపిండి పంపిణీ

శ్రీకాకుళం : శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని రేషన్ కార్డుదారులకు జనవరి రెండో తేదీ నుంచి చౌక ధరల దుకాణాల ద్వారా ఒక్కో కార్డుకు ఒక కిలో చొప్పున రూ.20కే గోధుమపిండిని పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై...

వీర గున్నమ్మ స్ఫూర్తితో పోరాటం

- అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అజయ్ కుమార్
- వీర గున్నమ్మ ప్రచార జాతాకు విశేష స్పందన

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్ కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

విప్లవ నారి వీర గున్నమ్మ స్ఫూర్తితో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈనెల 31 నుంచి విశాఖలో సిఐటియు అఖిల భారత మహాసభల నేపథ్యంలో వీరగున్నమ్మ ప్రచార జాతా మందసలోని వీర గున్నమ్మ స్థూపం వద్ద మంగళవారం ప్రారంభమైంది. వీరగున్నమ్మ స్థూపానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించిన అనంతరం అజయ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ జాతా మందస, పలాస, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో సాగింది. సారంగపురం, మందస బస్టాండ్, కాశీబుగ్గ బస్టాండ్, టెక్కలి కారు స్టాండ్, కోటబొమ్మాళి, నరసన్నపేట, శ్రీకాకుళం రూరల్ మండలంలోని నీలం జూట్ మిల్లు, శ్రీకాకుళం పాతబస్టాండ్, చిలకపాలెం కూడలి, రణస్థలం సాయి జూనియర్ కళాశాల, పైడిభీమవరంలోని అరబిందో పరిశ్రమ వద్ద సభలు నిర్వహించారు. ప్రచార జాతాకు కార్మికుల నుంచి విశేష స్పందన లభించింది. జాతా సందర్భంగా నిర్వహించిన సభల్లో అజయ్ కుమార్ మాట్లాడుతూ సిఐటియు అఖిల భారత మహాసభల్లో భాగంగా జనవరి 4న విశాఖపట్నంలో నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 4న మధ్యాహ్నం రెండు గంటలకు విశాఖపట్నం (మిగతా...2)

పెరిగిన హత్యలు... పోక్సో కేసులు

- మహిళలపై వేధింపులు పది శాతం పెరుగుదల
- తగ్గిన రోడ్డు ప్రమాదాలు
- గతేడాదితో పోలిస్తే 34 శాతం నేరాలు తగ్గుదల
- ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది చిన్నారులపై లైంగిక వేధింపులు (పోక్సో) పెరిగాయి. వీటితో పాటు అక్రమ సంబంధాలు, కుటుంబకలహాల నేపథ్యంలో హత్యలూ పెరినట్టు పోలీసు శాఖ గణాంకాలు చెప్తున్నాయి. జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి కె వి మహేశ్వరరెడ్డి మంగళవారం స్థానిక ఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నేర వార్షిక వివరాలను వెల్లడించారు. గతేడాది 39 కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం 54 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఏడాది కాలంలో 38 శాతం పెరిగాయన్నారు. ప్రేమ వ్యవహారాల నేపథ్యంలో 2024లో 28 కేసులు నమోదు కాగా, 2025లో 42 కేసులు నమోదయ్యాయన్నారు. దీనిపై మరింత దృష్టిపెడతామని తెలిపారు. కుటుంబసభ్యులు, బంధువులు, ఇరుగు పొరుగు వారు ఇలా పిల్లలకు తెలిసిన వారి వల్లే 12 ఏళ్లలోపు పిల్లలు ఎక్కువగా లైంగిక వేధింపులకు గురవుతున్నారని వివరించారు. మహిళలపై నేరాల విషయంలో గతేడాదితో పోలిస్తే ఒక శాతం పెరుగుదల (మిగతా...2)

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

యువతకు ఉద్యోగ కల్పన లక్ష్యం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. గతంలో నిరుద్యోగులు కంపెనీల చుట్టూ తిరిగితే ఇప్పుడు కంపెనీలే అభ్యర్థుల వద్దకు వచ్చి ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి నెలకొందని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన స్థానిక శ్రీసాయి శిరీష డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు 14 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించగా, మొత్తం 621 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 311 మందిని పలు ఉద్యోగాలకు ఎంపిక చేసి, వారికి (మిగతా...2)

'న్యూ ఇయర్' నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో ఈనెల 31 రాత్రి నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా, సురక్షితంగా చేసుకోవాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. న్యూ ఇయర్ ఈవెంట్లు, వేడుకలు, పార్టీలు నిర్వహించాలన్నా ముందస్తుగా పోలీస్ శాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ఎలాంటి ఈవెంట్లు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. న్యూ ఇయర్ సందర్భంగా రాత్రి ఒంటి గంట తర్వాత ప్రజలు రోడ్లపై తిరగరాదని, ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించకూడదని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాల స్వాధీనం, డ్రైవింగ్ లైసెన్సుల రద్దు వంటి (మిగతా...2)

జిల్లాలో ఓటర్లు 18,92,149

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో 18,92,149 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. అందులో పురుషులు 9,37,191 మంది కాగా, మహిళా ఓటర్లు 9,54,848 మంది ఉన్నారని వివరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నియోజకవర్గంలో అత్యధికంగా 2,75,568 మంది ఓటర్లు ఉండగా, ఆమదాలవలసలో అత్యల్పంగా 1,94,209 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 2,358 పోలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గత జనవరి 6 నుంచి ఈనెల 30 వరకు ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు కోసం 37,586 దరఖాస్తులు అందాయని, వాటిలో 29,795 దరఖాస్తులను ఆమోదించామని వివరించారు. ఓటరు జాబితా నాణ్యత, పారదర్శకత విషయంలో రాజకీయ పార్టీల (మిగతా...2)

సంతకం చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆరోసారీ ఆయనే...

- ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా సాయిరాం
- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా హనుమంతు సాయిరాం ఆరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2011 నుంచి ఆయన జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. జిల్లా కార్యదర్శిగా చల్లా శ్రీనివాసరావు, మరో 17 మంది సభ్యులతో కూడిన మొత్తం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో కార్యవర్గ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. ఉదయం నామినేషన్లను స్వీకరించగా, గడువు ముగిసేసరికి సాయిరాంతో పాటు అతని


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

తగ్గుతున్న కూటమి గ్రాఫ్

- కూటమి పార్టీల్లోనూ అసంతృప్తి
- రోడ్డెక్కుతున్న రైతులు, కార్మికులు, పలు తరగతుల ప్రజలు
- ప్రభుత్వ వ్యతిరేకతను మలుచుకోలేకపోతున్న వైసిపి
- ప్రజా ఉద్యమాల్లో వామపక్షాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వంపై క్రమేణా ప్రజా వ్యతిరేకత పెరుగుతోంది. సూపర్ సిక్స్ హామీలు అమలు చేశామని గొప్పలు చెప్తున్నా, ఆ రకమైన సంతృప్తి ప్రజల్లో కనిపించడం లేదు. ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్న విమర్శలను మూటగట్టుకుంటోంది. ప్రధానంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం విషయంలో రైతుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. రైతులు, కార్మికులు, స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగుల్లోనూ క్రమేణా అసహనం పెరుగుతోంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూ సర్వే తప్పిదాల కారణంగా రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒకరి భూమి వేరొకరి పేరు మీద నమోదు కావడం, జిరాయతీ భూములు నిషేధిత జాబితాలో నమోదు చేయడం వంటి సమస్యలతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మండలస్థాయిలో పరిష్కరించాల్సిన భూ సమస్యలను తహశీల్దార్లు పట్టించుకోకపోవడంతో, వారు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు వస్తున్నారు. ఇక్కడ కూడా వారి సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతుల సమస్యలు అపరిష్కృతంగానే ఉండి పోతున్నాయి. ఇది కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతకు పెంచుతోంది. పరిశ్రమల్లో ఇప్పటివరకు ఎనిమిది గంటల పని విధానం అమల్లో ఉండగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దాన్ని 13 గంటలకు పెంచడంపై కార్మికవర్గంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. తమ సమస్యలను పరిష్కరించాలంటూ రోడ్డెక్కుతున్న పరిస్థితి నెలకొంది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లోనూ మునుపటి ఉత్సాహం కనిపించడం లేదు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలే ఊసే ఎత్తడం లేదు. ఉద్యోగులకు ఆర్థికపరమైన ప్రయోజనాలు కల్పించడంలో ముఖం చాటేయడంపై వారిలో అంతర్లీనంగా తీవ్ర అసంతృప్తి ఉంది. (మిగతా...2)

పెరిగిన హత్యలు... పోక్సో కేసులు

ఉందని తెలిపారు. 2024లో 477 కేసులు కాగా, 2025లో 482 కేసులు నమోదయ్యాయని చెప్పారు. వరకట్న మరణాలు, అత్యాచార కేసులు, ఆత్మహత్యకు ప్రేరేపించడం వంటి కేసులు తగ్గుముఖం పట్టగా భార్యాభర్తల మధ్య తగాదాలు స్వల్పంగా పెరిగాయన్నారు. మొత్తం మీద గతేడాదితో పోలిస్తే అన్ని రకాల నేరాల విషయంలో 34 శాతం మేర తగ్గాయని చెప్పారు. గతేడాది 9555 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 6,314 కేసులు నమోదయ్యాయని తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టిలపై పెరిగిన అత్యాచారాలు

గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఎస్‌సి, ఎస్‌టిలపై అత్యాచారాలు పెరిగాయని ఆయన తెలిపారు. 2024లో ఏడు అత్యాచార కేసులు, 2025లో ఎనిమిది కేసులు నమోదయ్యాయన్నారు. ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద నమోదైన కేసుల్లో 33 శాతం మేర తగ్గాయన్నారు. గతేడాది 66 కేసులు, ఈ సంవత్సరం 44 కేసులు నమోదయ్యాయన్నారు.

ఆస్తి నేరాలు తగ్గుముఖం

ఆస్తికి సంబంధించి నమోదైన కేసుల్లో నాలుగు శాతం మేర తగ్గాయి. 2024లో 411 కేసులు 2025లో 396 కేసులు నమోదయ్యాయని తెలిపారు. 2025లో 400 కేసులు చేధించి, పోగొట్టుకున్న సొమ్ములో 91 శాతం రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. వీటితోపాటు 2021 నుంచి 2024 మధ్య కాలంలో నమోదైన కేసుల్లో పోగొట్టుకున్న ఆస్తిలో సగటున 90 శాతం మేర రికవరీ చేసి అందించామని తెలిపారు.

రోడ్డు ప్రమాదాలను నివారించగలిగాం

పోలీసుశాఖ చేపట్టిన పలు చర్యలతో రోడ్డు ప్రమాదాలను నివారించగలిగామని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు డ్రంక్ అండ్ డ్రై కోసం ప్రత్యేక డ్రైవ్‌లు, స్టాప్ వాష్ అండ్ గో, బ్లాక్ స్పాట్లు గుర్తింపు, నిరంతర వాహన తనిఖీలు, ద్విచక్ర వాహనాలతో హైవేలో పెట్రోలింగ్ వంటి చర్యలతో రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. 2024లో 279 తీవ్ర ప్రమాదాలు చోటు చేసుకోగా 288 మంది మరణించారని తెలిపారు. 2025లో 243 ప్రమాదాలు జరగగా 266 మంది చనిపోయారని చెప్పారు. గతేడాదితో పోలిస్తే 21 శాతం మేర ప్రమాదాలు తగ్గాయని తెలిపారు.

తగ్గిన వైట్ కాలర్ నేరాలు

జిల్లాలో గత సంవత్సరంతో పోలిస్తే 13 శాతం మేర వైట్ కాలర్ నేరాలు తగ్గాయని చెప్పారు. 2024లో 28 సైబర్ కేసులు, 2025లో 44 కేసులు నమోదయ్యాయన్నారు. ఛీటింగ్ కేసులు 96 నుంచి 85కు తగ్గాయని తెలిపారు.

మిస్సింగ్ కేసుల్లో తగ్గుదల

2024లో 408 మిస్సింగ్ కేసులు నమోదు కాగా 378 కేసులు ట్రేస్ చేశామని తెలిపారు. 2025లో 353 కేసులు నమోదు కాగా, 303 కేసులు ట్రేస్ చేశామని వివరించారు. గతేడాది 76 మంది బాలికలు తప్పిపోగా ఈ ఏడాది 51 మంది మిస్సయ్యారని వారిలో 48 మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు. బాలుర్ల మిస్సింగ్‌కు సంబంధించి గతేడాది 14 కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం 11 మంది మిస్సయ్యారని వారందరినీ ఇళ్లకు చేర్చామని తెలిపారు. 2024లో 236 మంది మహిళలు మిస్సవ్వగా 230 మందిని, 2025లో 214 మంది తప్పిపోగా 192 మంది ట్రేస్ చేశామని తెలిపారు. పురుషుల్లో గతేడాది 82 మంది, ఈ సంవత్సరం 77 మంది మిస్సయ్యారని చెప్పారు.

పెరిగిన గంజాయి కేసులు

మూడేళ్ల కాలంలో గంజాయి కేసులు బాగా పెరిగాయని తెలిపారు. 2023లో 19, 2024లో 52 కేసులు నమోదు కాగా 2025లో 137 కేసులు వెలుగు చూశాయన్నారు. జిల్లాలో గంజాయి అమ్మకం, సేవిస్తున్న వారిని గుర్తించి ఆరు కేసులు నమోదు చేసి 43 మందిని అరెస్టు చేశామన్నారు. జిల్లాకు చెందిన 16 మందిపై కేసులు పునరావృతమవుతుండడంతో, వారిలో తొమ్మిది మందిపై తదుపరి చర్యలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

జోరుగా పేకాటలు

2024లో 254 పేకాట కేసుల్లో 1292 మంది నిందితుల నుంచి రూ.48,59,217 స్వాధీనం చేసుకున్నామన్నారు. 2025లో 353 కేసుల్లో 2,039 మంది నిందితుల నుంచి రూ.70,82 930 స్వాధీనం చేసుకున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా మద్యం

బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్న వారిపై గతేడాదితో పోలిస్తే కేసులు నమోదు సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. 2024లో 3,310 కేసులు నమోదు కాగా 2025లో 12,060 కేసులు నమోదయ్యాయన్నారు.

మొబైల్ ఫోన్ల రికవరీలో గణనీయమైన ప్రగతి

సాంకేతిక విశ్లేషణ, డిజిటల్ ట్రాకింగ్, నిఘా వ్యవస్థల సాయంతో బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేయగలిగామని తెలిపారు. 2024లో రూ.1,06,17,500 విలువ కలిగిన 585 ఫోన్లను రికవరీ చేయగా, ఈ ఏడాది రూ.1,64,30,000 విలువ గల 1060 ఫోన్లను రికవరీ చేశామని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్‌పిలు శ్రీనివాసరావు, కె.వి రమణ, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఓటర్లు 18,92,149

సూచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎం) అత్యంత భద్రంగా ఉన్నాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోదాములను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే తనిఖీల్లో భాగంగా గోదాము సీళ్లను తెరిచి యంత్రాలను పరిశీలించారు. అనంతరం తనిఖీ పుస్తకంలో కలెక్టర్‌తో పాటు ప్రతినిధులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎస్.వి లక్ష్మణమూర్తి, ఎన్నికల విభాగం అధికారి రాజేశ్వరరావు, పలు పార్టీల ప్రతినిధులు పి.ఎం.జె బాబు, భూపతి అర్జున్ కుమార్, సురేష్ సింగ్, రౌతు శంకరరావు, ఎల్.సోమేశ్వరరావు, ఎం.గోవిందరావు, కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక శబ్దం వచ్చే సౌండ్ సిస్టమ్‌లు, డిజెలు తదితర శబ్ద కాలుష్యం కలిగించే పరికరాల వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తున్నామని స్పష్టం చేశారు. న్యూ ఇయర్ సందర్భంగా ముఖ్యమైన పట్టణాలు, కూడళ్లు, రహదారులపై ప్రత్యేక పోలీస్ బందోబస్తు, గస్తీ, వాహనాల తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

యువతకు ఉద్యోగ కల్పన లక్ష్యం

నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ వచ్చిన అవకాశం చిన్నదని, జీతం తక్కువని, దూర ప్రాంతమని వెనకడుగు వేయక తొలి అడుగు వేస్తేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని చెప్పారు. ఎంప్లాయిమెంట్ పోర్టల్‌లో ప్రతిఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కె.సుధ సూచించారు. యువతలో నైపుణ్యాల ప్రాముఖ్యత గురించి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.వి రమణమూర్తి వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధిని వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ అన్నారు. ఏ రంగంలో అవకాశం వచ్చినా దూరాన్ని లెక్క చేయకుండా చేరాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి సుబ్బిరెడ్డి, ఎన్.వై.కె డిప్యూటీ డైరెక్టర్ ఉజ్వల్, సెట్‌శ్రీ సిఇఒ అప్పలనాయుడు, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోసారీ ఆయనే...

ప్యానల్ అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. దీంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి ఆర్.రవిశంకర్, సహాయ ఎన్నికల అధికారి వై.ఎన్ ప్రసాద్ ప్రకటించారు. కొత్త కార్యవర్గం రెండేళ్ల పాటు కొనసాగుతుంది.

నూతన కార్యవర్గం

అధ్యక్షులుగా హనుమంతు సాయిరాం, సహాధ్యక్షులుగా కె.జయరావు, ఉపాధ్యక్షులుగా టి.సోమేశ్వరరావు, ఆర్.వేణుగోపాల్, పి.జానకిరాం,

మొదటిపేజీ తరువాయి

డి.శ్రీరామ్‌కుమార్, ఎల్.జగన్మోహనరావు, పి.శ్రావణి, కార్యదర్శిగా చల్లా శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆర్.గోవింద్ పట్నాయక్, సంయుక్త కార్యదర్శులుగా ఎ.జె.ఎం రాధాకృష్ణ, కె.మోహనరావు, బి.వెంకటేశ్వరరావు, కె.మన్మథరావు, కె.వి.వి సత్యనారాయణ, జి.లలిత, కోశాధికారిగ బడగల పూర్ణచంద్రరావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం అనంతరం సాయిరాం మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై రాజీ లేని పోరాటం సాగిస్తామన్నారు. ఎపి గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ చౌదరి పురుషోత్తం నాయుడు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవ, ఉద్యోగుల సమస్యల్యపై పోరాటం లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు.

తగ్గుతున్న కూటమి గ్రాఫ్

కూటమి పార్టీల మధ్య నెలకొన్న అసంతృప్తి కూడా ప్రభుత్వంపై పడుతోంది. ఎన్నికల ముందు గెలుపు కోసం సమన్వయ కమిటీ సమావేశాలను నిర్వహించడంలో చొరవ చూపిన టిడిపి, ఇప్పుడు వాటే ఊసే ఎత్తకపోవడంపై బిజెపి, జనసేన కేడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు, శంకుస్థాపనలకు, ఇతర కార్యక్రమాలకు తమను పిలవడం లేదంటూ అసహనంతో రగిలిపోతున్నారు. నామినేటెడ్ పదవులు దక్కినా ఏ పార్టీలోనూ సంతోషం లేకుండా పోయింది. జనసేన, బిజెపితో పొత్తు వల్ల తమకు పదవులు దక్కడం లేదన్న అసంతృప్తి టిడిపి శ్రేణుల్లో ఉంది.

ప్రభుత్వ వ్యతిరేకత క్రమేణా పెరుగుతున్నా, దాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంలో వైసిపి విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రస్థాయిలో ఇచ్చిన పిలుపులకు కాస్తాకూస్తో జిల్లా నాయకత్వం స్పందిస్తున్నా, జిల్లాలో పలు తరగతుల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై కనీసం స్పందించడం లేదు. మరోవైపు పార్టీ అధిష్టానం వైఖరి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అప్పుడప్పుడు చేస్తున్న వ్యాఖ్యలు మునుపటి వైసిపి ప్రభుత్వ నిర్బంధాన్ని గుర్తు చేస్తున్నాయి. మెడికల్ కళాశాలలను తీసుకున్న ప్రైవేట్‌కు తీసుకున్న వ్యక్తులను అరెస్టు చేస్తామని చెప్పడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. తప్పు చేసిన పోలీసులపై చర్యలు, డిజిటల్ బుక్ వంటి అంశాలూ వైసిపిపై జనానికి వెగటు పుట్టిస్తున్నాయి. రాష్ట్రస్థాయిలో ప్రకటనలు చేస్తున్నా కొన్ని వ్యాఖ్యలు వైసిపిపై సానుకూలతను దెబ్బతిస్తోందని పార్టీ శ్రేణుల్లో చర్చ నడుస్తోంది.

టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా, జిల్లాకు ఒక్క పరిశ్రమ కేటాయించలేదు. విశాఖలో పెట్టుబడులు సదస్సు నిర్వహించిన కూటమి ప్రభుత్వం వెనుకబడిన జిల్లాగా ఉన్న శ్రీకాకుళానికి మొండిచేయి చూపింది. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే పరిశ్రమలను అమరావతిలోనో, విశాఖలోనో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వం... జిల్లాలో మాత్రం కాలుష్యకారక, ప్రజల ఉపాధిని దెబ్బతీసే పరిశ్రమలను ఏర్పాటుకు సిద్ధమవుతోంది. మందసలో కార్గో ఎయిర్‌పోర్టు, సరుబుజ్జిలిలో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజలు తీవ్రంగా పోరాడుతున్నారు. వారు సాగిస్తున్న ఉద్యమాలకు సిపిఎంతో పాటు ఇతర వామపక్ష పార్టీలు అండగా నిలిచాయి.

వీర గున్నమ్మ స్ఫూర్తితో పోరాటం

ఆర్‌టిసి కాంప్లెక్స్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రదర్శన అనంతరం మున్సిపల్ స్టేడియంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా కార్పొరేట్లకు కొమ్ము కాసి కార్మిక ఉద్యమాలను అణచివేస్తున్నాయని విమర్శించారు. ధరల పెరుగుదల ఆకాశాన్ని అంటుతున్నాయని, కార్మికుల జీతాలు పాతాళంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు అదానీ, అంబానీ కార్పొరేట్ల ఆస్తులు వంద రెట్లు అమాంతంగా పెరుగుతున్నాయన్నారు. అసమానతలు, పేదరికం ఎన్నడూ లేని స్థాయికి చేరాయన్నారు.

విశాఖపట్నంలో నిర్వహించే అఖిల భారత సిఐటియు మహాసభలు కార్మికవర్గ అనుకూల విధానాలను అమలు చేయించడానికి పాలకవర్గంపై ఒత్తిడి పెంచనుందన్నారు. ప్రత్యామ్నాయ విధానాల కోసం సమరశీల శంఖరావం పూరించనుందని చెప్పారు. కార్మిక, కర్షక ఐక్యతతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టడమే అఖిల భారత మహాసభల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కార్పొరేట్లకు మేలు చేసే, కార్మిక వర్గం హక్కులను హరించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందన్నారు. దేశంలో పలు రంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మికవర్గ పోరాటాలను నిర్మించేందుకు మహాసభలు దోహదపడతాయని తెలిపారు.

జాతాలో సిఐటియు సీనియర్ నాయకులు మట్ట ఖగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, సిఐటియు నాయకులు కె.కేశవరావు, హెచ్.ఈశ్వరరావు, ఎం.ఆదినారాయణమూర్తి, అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.సుధ, వ్య.కా.స నాయకులు కొల్లి ఎల్లయ్య, నీలం జూట్ మిల్లు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి నక్క సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్ కుమార్

2 నుంచి కొత్త పాస్ పుస్తకాల పంపిణీ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో పాత భూహక్కు పత్రాల స్థానంలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు ప్రత్యేకంగా రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి వీటిని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 652 గ్రామాల్లో మొత్తం 2,54,218 పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం జారీ చేస్తున్న ఈ కొత్త పాస్ పుస్తకాల్లో ఎలాంటి రాజకీయ ముద్రలు, లోగోలు లేకుండా కేవలం ప్రభుత్వ చిహ్నంతోనే ముద్రించినట్లు స్పష్టం చేశారు. వెబ్‌ల్యాండ్ డేటాతో క్షుణ్ణంగా ధ్రువీకరించిన తర్వాతే అర్హులైన రైతులకు ఈ పత్రాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. పంపిణీ సమయంలో ఏవైనా అభ్యంతరాలు వస్తే వాటిని నమోదు చేసి, సంబంధిత తహసీల్దార్ ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు తమకు కేటాయించిన గ్రామసభల వేదికలకు వెళ్లి వీటిని తీసుకోవచ్చని, సభల షెడ్యూల్ వివరాలను ఆయా సచివాలయాల్లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. భూములకు సంబంధించి పూర్తి పారదర్శకతతో కూడిన రికార్డులను అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం : సినీ నటి రోహిణి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

పుస్తకపఠనంతోనే విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని, ప్రస్తుత యువత సెల్‌ఫోన్లవి వినియోగంలో పడి పుస్తకాలకు దూరమవుతున్నారని ప్రముఖ సినీ నటి రోహిణి అన్నారు. సిఐటియు 18వ జాతీయ మహాసభలు సందర్భంగా స్థానిక ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో "శ్రామిక ఉత్సవ్" పేరిట నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు విశేష ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఆమె అక్కడి పుస్తక మహోత్సవం, సైన్స్ ఎగ్జిబిషన్, ఫొటో ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు.

పుస్తకాలకు దూరమవుతున్న యువత

పుస్తక ప్రదర్శనను సందర్శించిన అనంతరం రోహిణి మాట్లాడుతూ ఆధునిక యుగంలో సాంకేతికత పెరిగి యువత ఎలక్ట్రానిక్ పరికరాలకే పరిమితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పుస్తక పఠనం తగ్గిపోతోందని, ఇలాంటి తరుణంలో ప్రజలను మళ్లీ పుస్తకాల వైపు మళ్లించేందుకు నిర్వాహకులు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ఆమె స్వయంగా పలు పుస్తకాలను పరిశీలించి, వాటి విశిష్టతలను అడిగి తెలుసుకున్నారు.

ఆలోచింపజేసే కార్టూన్లు

కార్టూన్ ప్రదర్శనను వీక్షించిన రోహిణి, భావవ్యక్తీకరణకు కార్టూన్లు అత్యంత శక్తివంతమైన మాధ్యమాలని పేర్కొన్నారు. గతంలో దినపత్రికల్లో ప్రతిరోజూ కార్టూన్లు వచ్చేవని, కానీ ఇప్పుడు అవి తగ్గుముఖం పట్టడం బాధాకరమని ఆవేదన వ్యక్త చేశారు. యువత ఈ కళకు కూడా దూరమవుతోందని వ్యాఖ్యానించారు. అనంతరం సైన్స్, ఫోటో ఎగ్జిబిషన్‌ల్లోని ప్రదర్శనలను చూసి అక్కడి ప్రత్యేకతలను ఆశ్చర్యంతో వీక్షించారు.

షార్ట్ ఫిలింలే రేపటి పునాది

ఈ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన షార్ట్ ఫిలిం స్క్రీనింగ్‌లో 'జయహే' అనే లఘు చిత్రాన్ని ఆమె వీక్షించారు. ఈ సందర్భంగా యువ కళాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ "నేటి తరం దర్శకులందరికీ షార్ట్ ఫిలింలే పునాదన్నారు. యువత కొత్త ఆలోచనలతో చిత్ర నిర్మాణ రంగంలోకి రావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు, ప్రజలు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న సినీ నటులు రోహిణి, మాదాల రవి

రాజకీయ దృక్పథంతోనే అభ్యుదయ సాహిత్యం

గురజాడ అజెండాను అమలు చేసి చూపించిన శ్రీశ్రీ

కవి, రచయిత అట్టాడ అప్పలనాయుడు

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి

సరైన రాజకీయ దృక్పథం, వర్గదష్టితోనే అభ్యుదయ సాహిత్యం సాధ్యమవుతుందని ప్రముఖ కవి, రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. ఇటువంటి ప్రయత్నంలో మహాకవి గురజాడ అజెండా సెట్ చేస్తే శ్రీశ్రీ, కాళీపట్నం రామారావు తదితర కవులు వాటిని మరింత ముందుకు తీసుకెళ్లారని వివరించారు. సిఐటియు 18వ అఖిలభారత మహాసభల సందర్భంగా స్థానిక ఎయు ఎగ్జిబిషన్ మైదానంలో శ్రామిక ఉత్సవ్ అనే కార్యక్రమం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన శ్రామిక సాహిత్య వేదికలో 'అభ్యుదయ సాహిత్య భావధార' అన్న అంశంపై అరసం విశాఖ జిల్లా అధ్యక్షులు ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన మంగళవారం చర్చాగోష్టి జరిగింది. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ సమాజంలో ఎన్నో రకాల సాహిత్యం ఉన్నప్పటికీ, అభ్యుదయ సాహిత్యం ప్రత్యేకమైందని వివరించారు. ప్రధానంగా ఈ తరహా సాహిత్యం 1930 నుంచి 1955 మధ్య విరివిగా అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆ కాలంలో ప్రపంచ దేశాల్లో మారిన పరిస్థితులు, సంఘర్షణ కవులు, రచయితలపై తీవ్ర ప్రభావం చూపడమే ఇందుకు కారణమన్నారు. ఆ కాలంలోనే రష్యాపై దాడి జరుగుతున్న నేపథ్యంలో 'గర్జించు రష్యా... గాండ్రించు రష్యా' అంటూ శ్రీశ్రీ తన కవితలతో ప్రపంచంలో మారుతున్న రాజకీయ పరిస్థితులను, అందులో మంచి చెడులను జనానికి అర్థమయ్యే రీతిలో చెప్పారని గుర్తు చేశారు. 'ఏడవకండేడవకండి! ... ఏడవకండి.. ఏడవకండి! ఓ వ్యథా నినిష్టులార! ఓ కథా వశిష్టులార! పతితులార! భ్రష్టులార! బాధాసర్పదష్టులార! ఏడవకం డేడవకండి! ... జగన్నాథ రథచక్రాలు వస్తున్నాయి' అంటూ పీడిత ప్రజానీకానికి ఆయన అండగా నిలిచారని కొనియాడారు. చాసో అభ్యుదయ కథలు కూడా జనాల్లోకి బాగా వెళ్లాయన్నారు. శ్రీశ్రీ, చాసోలపై గురజాడ అభ్యుదయ రచనల ప్రభావం ఉండడం వల్ల సమాజాన్ని ప్రభావితం చేయగలిగే కవితలు, రచనలు వీరు చేశారని అన్నారు. వీరితో పాటు అనేకమంది కవులు, రచయితలు తెలుగు నాట అభ్యుదయ సాహిత్యానికి పెద్దపీట వేశారని వివరించారు. కవి, సాహితీవేత్త డాక్టర్ జివిఎస్ జయపాలరావు మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యంలో గురజాడ మానవతావాదాన్ని ఎంచుకుంటే, రష్యా విప్లవం ప్రభావంతో శ్రీశ్రీ మానవహక్కులను ప్రధానాంశంగా తీసుకుని ముందుకు నడిపారన్నారు. రైతులు, కార్మికులు, దళితులు, పేదలు, గిరిజనుల ఈతి బాధలు, ఆశలు, ఆకాంక్షలు వీరిద్దరి అభ్యుదయ సాహిత్యంలో ఉన్నాయన్నారు. స్వాతంత్ర్య అనంతరం, ప్రజాస్వామ్య విలువలు, లౌకిక, శాస్త్రీయ దృక్పదం వంటి భావాలు కూడా అభ్యుదయ సాహిత్యంలో ఇమిడిపోయాయన్నారు. సమకాలీన పరిస్థితుల్లో అభ్యుదయ సాహిత్యం కొత్తరూపంలో కొనసాగుతోందన్నారు. గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్, కార్పొరేట్ సంస్కృతి వంటి ఆధునిక భావాల్లో లోపాలను కూడా ఇది ప్రశ్నిస్తోందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఉటంకిస్తూ "ప్రస్తుతం పాలకుల యొక్క భావజాలం... పులిరాజు భావజాలం.. గొంగడి పురుగు చిత్ర విచిత్ర వేషాలు.. అల్పబుద్ధి కోతుల విన్యాసాలు.. ఊసరవల్లి పార్టీల మార్పులు.. గొర్రెల మందకు చెప్పే తోడేళ్ల కబుర్లు... గాలివార్తలు వెదజల్లే పిల్లులు... నేటి రాజకీయంలో నాయకుల అవసరాలు... అంటూ రాజకీయ ముసుగులో చేస్తున్న స్వార్థాన్ని వివరించారు. ఈ తరుణంలో సమాజానికి అభ్యుదయ సాహిత్య అవసరం ఎంతో ఉందన్నారు. బానిసత్వానికి వ్యతిరేకంగా పుట్టిన అది అంతమయ్యే వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం అరసం విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు సర్వసిద్ధి హనుమతరావు మాట్లాడారు. వీరికి సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ చేతులమీదుగా శ్రమ అవార్డులు ప్రదానం చేశారు.

శ్రమ అవార్డులతో అట్టాడ అప్పలనాయుడు, జయపాలరావు, తదితరులు, చిత్రంలో ఎంవిఎస్.శర్మ

లఘు చిత్రాలు.. పెద్ద సందేశాలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

సిఐటియు 18వ జాతీయ మహాసభలు సందర్భంగా స్థానిక ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో "శ్రామిక ఉత్సవ్" పేరిట నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు నాలుగో రోజు మంగళవారం ప్రదర్శించిన లఘు చిత్రాలు సామాజిక చైతన్యాన్ని, సమకాలీన సమస్యలను ఎంతో శక్తివంతంగా ఆవిష్కరించాయి. ప్రముఖ నటీనటులు రోహిణి, మాదాల రవి ఈ చిత్రాలను ప్రత్యక్షంగా వీక్షించి లఘు చిత్ర దర్శకులను అభినందించారు. మంగళవారం జరిగిన ప్రదర్శనలో 7 చిత్రాలు ప్రదర్శించారు.

- విశాఖపట్నంకు చెందిన శంకర్ దర్శకత్వం వహించిన మై ఓటు నాట్ ఫర్ సేల్ లఘు చిత్రం ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధం. కానీ నేటి రాజకీయాల్లో ఓటును నోటుకు అమ్ముకోవడం వల్ల ప్రజలు తమ ఐదేళ్ల భవిష్యత్తును ఎలా తాకట్టు పెడుతున్నారో ఈ చిత్రం కళ్లకు కట్టినట్లు చూపింది.
- విశాఖపట్నం కు చెందిన సుదీప్ సాయి దర్శకత్వం వహించిన లఘు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై తీసిన ఈ చిత్రం ప్రస్తుతం ఎంతో ప్రాధాన్యత కలిగింది. స్టీల్ ప్లాంట్ కేవలం ఒక ఫ్యాక్టరీ మాత్రమే కాదు, వేలాది కుటుంబాల జీవనాధారం, విశాఖ ప్రజల ఆత్మగౌరవం అని ఇందులో వివరించారు.
- విఎస్ఎఫ్ఎం నిర్మించిన 100వ అల్లూరి లఘు చిత్రంలో అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎంత అవసరమో ఈ చిత్రం చాటిచెప్పింది. కేవలం చరిత్ర పుస్తకాల్లోనే కాకుండా, నేటి అన్యాయాలపై గొంతెత్తే ప్రతి ఒక్కరిలోనూ అల్లూరి ఉండాలని ఉద్బోధించింది.
- విశాఖపట్నం కు చెందిన కె.మహేష్ బాబు దర్శకత్వం వహించిన అన్సంగ్ హీరోస్ లఘు చిత్రం మన నగరాన్ని శుభ్రంగా ఉంచే మున్సిపాలిటీ వర్కర్ల (పారిశుధ్య కార్మికుల) జీవితాలను చిత్రీకరించిన డాక్యుమెంటరీ ఇది. వారు పడుతున్న ఆరోగ్య సమస్యలు, సామాజిక వివక్ష మరియు వారి నిస్వార్థ సేవను ఇందులో చూపారు.
- ఫ్యుబె క్రియేషన్ నిర్మాణం రూపొందించిన ఎఫ్-2 లఘు చిత్రం నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్న నేటి యువత ప్రతినిధిగా ఒక యువకుడి పాత్రను ఇందులో చూపారు. చదువు పూర్తి చేసి ఉద్యోగం కోసం అతను పడే ఆవేదన, ఎదుర్కొనే సవాళ్ల ప్రతి నిరుద్యోగిని ఆలోచింపజేస్తాయి.
- విశాఖపట్నంకు చెందిన పి.రమేష్ కుమార్ దర్శకత్వం వహించిన జయహే లఘు చిత్రం మత సామరస్యంపై తీసిన సందేశాత్మక చిత్రం. కుల, మతాల కంటే మానవత్వం గొప్పదని, వైవిధ్యంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో అంతా కలిసి ఉండాలని ఈ చిత్రం ప్రబోధించింది.
- చివరిగా విశాఖపట్నం కు చెందిన దామోదర్ దర్శకత్వం వహించిన యుద్ధం ప్రకటించు లఘు చిత్రం యువతను పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్య 'మత్తు' మాయదారి మత్తులో పడి జీవితాలను ఎలా పాడుచేసుకుంటున్నారో చూపిస్తూ, ఆ అలవాట్లపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చింది.
- ప్రదర్శన అనంతరం "ఇది ఆరంభం" అనే షార్ట్ ఫిలిం పోస్టర్‌ను రోహిణి, మాదాల రవి ఆవిష్కరించారు. భవిష్యత్తులో కార్మిక, సామాజిక సమస్యలపై మరిన్ని చిత్రాలు రాబోతున్నాయని అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ చిత్రాలన్నీ కేవలం కళాఖండాలుగా మాత్రమే కాకుండా, సమాజాన్ని మార్చే ఆయుధాలుగా నిలుస్తాయని తెలిపింది.

'ఇది ఆరంభం' షార్ట్ ఫిల్మ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రోహిణి, మాదాల రవి

ప్రజాశక్తి
www.prajasakti.com
శ్రీకాకుళం
బుధవారం 31 డిసెంబర్ 2025

ప్రధాన వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఐటియు అఖిల భారత అధ్యక్షులు హేమలత

ఉత్సాహం.. ఉత్తేజం

సందడిగా శ్రామిక ఉత్సవ్
నాలుగో రోజూ జనతాకిడి
ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

సిఐటియు అఖిల భారత మహాసభ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్‌లో భాగంగా తలపెట్టిన కళా, సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఫొటో, కార్టూన్, సైన్స్ ఎగ్జిబిషన్లను చూసేందుకు యువత తరలివచ్చారు. మంగళవారం నాటి ఉత్సవ్‌లో సినీ నటులు రోహిణి, మాదాల రవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారిరువురూ ఉత్సవ్‌లోని అన్ని స్టాల్స్‌నూ కలియదిరిగారు. ఉత్సవ్ ప్రధాన వేదికపై వారు చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఎర్రజెండా గొప్పతనాన్ని తెలియజేసింది. వారి మాట్లాడుతున్నంతసేపూ చప్పట్ల వర్షం కురిసింది.

CITU
18th ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4, VISAKHAPATNAM

డ్యాన్సులతో ఆకట్టుకున్న చిన్నారులు

మహాసభ జరిగే ఎయు కన్వెన్షన్ సెంటర్ వద్ద రెడ్‌షర్ట్ వాలంటీర్లు

రెడ్ షర్ట్ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు మురళి

సాగర తీరంలో రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు

రోహిణి, మాదాల రవికి జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

ఒక్కో కళారూపం.. ఎంతో ప్రత్యేకం..

ప్రజాశక్తి
-భీమునిపట్నం

సిఐటియు అఖిల భారత మహాసభల నేపథ్యంలో మంగళ వారం సాయంత్రం ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో "శ్రామిక ఉత్సవ్" పేరిట నిర్వహించిన కార్మికుల పండగ నాలుగో రోజు మంగళవారం అదే ఉత్సాహం, చైతన్యం తో సాగింది. నాగభైరవ కోటేశ్వర రావు రాసిన ప్రజానాట్య మండలి కళాకారులు అప్పన్న ఆధ్వర్యంలో కళాకారులు పాడిన "ఇదే ఇదే నా దేశం... ఇదే ఆంధ్ర దేశం, తరతరాల చరిత్ర లో తనిసిన సందేశం' అన్న పాట సభికులను ఉత్సాహ పరిచింది. శాతవాహనుల శౌర్యం, కాకతీయుల సంగ్రామం, త్యాగరాజు గానం తదితర అంశాలను జోడించి పాడిన పాట ఆలోచింప జేసింది. హంపి, అమరావతి, గోదావరి, కష్ణవేణి కూచిపూడి నృత్యం .. సంస్కృతి సౌరభం వెల్లివిరిసిన నేపథ్యాన్ని ఈ పాటలో పొందుపరిచారు.

విశాఖ జివిఎంసి డప్పు కళాకారుల "తీన్ మార్"ఆకట్టుకుంది.

గాయకులు పెద్ది రాజు అధ్వర్యంలో కళాకారులు పాడిన "రగిలి పోయే ఉద్యమాల జ్వాల, ఇది తెల్ల దొరలనే తరిమేసిన నేల " పాటలో ప్రజా ఉద్యమాలపై నిర్బంధాలు కొత్తేమీకాదని, నిలదీసే గొంతును నొక్కేసినా, ప్రశ్నించే వారిని భయపెట్టినా ఉద్యమాలు ఆగవని వివరించే ప్రయత్నం చేశారు. దేవేంద్ర రాసిన 'తెలుగు భాష ఆకాశంలో పున్నమి చంద్రుడు గురజాడ' అంటూ ప్రజానాట్య మండలి కళాకారులు చంటి పాడిన పాట తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పారు.

'పల్లె పల్లెలో ఎగురే ద్దాం
ఎర్ర జెండా.. గల్లిగల్లి లో
ఎగురేద్దాం ఎర్ర జెండా' అంటూ
ఆశా కార్యకర్తల కోలాటం ఆలోచింప జేసింది.

రాజేశ్వరి బృందం చిన్నారులు ప్రదర్శించిన క్లాసికల్ డాన్స్ అబ్బురపరిచింది. అంగన్వాడీ ఉద్యమాన్ని ఉదహరిస్తూ జగన్ పాడిన 'పట్టు పట్టక్క.. జెండా పట్టక్క.. సిఐటియు నీకు నాకు అండ దండక్క' పాట సిఐటియు విశిష్టతను వివరించారు.

చింతల యాదగిరి రాసిన 'పద పద రా భగత్ సింగ్ వారసుడా, యువ భారత నవ శక్తి కి నాయకుడా' అంటూ ఏలూరు జిల్లా కళాకారుల బృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ త్యాగాన్ని వివరించారు. భగత్ సింగ్ అసమానమైన త్యాగం, ఆయన ఆలోచన స్వేచ్ఛకు సంకేతం అంటూ కళాకారులు వివరించారు.

ఏటుకూరి ప్రసాద్ రాసిన 'ఇదే ఎర్ర బాటరా.. ఇదే వెలుగు బాటరా' అంటూ కళాకారులు పాడిన పాట ఎర్ర జెండా ప్రాధాన్యత, విశిష్టత ను వివరించారు. ఎర్ర జెండా పుట్టింది త్యాగాల కొలిమిలో.. అంటూ కళాకారులు ఎర్ర జెండా ప్రాధాన్యత ను వివరించారు.

విప్లవ మార్గం అంటే పూల మార్గం కాదురా.. మార్క్స్, లెనిన్ సిద్ధాంతం భావ కవిత కాదురా .. అంటూ కళాకారులు పాడిన పాట ఆలోచింపజేసింది.

ఇతర రాష్ట్రాల నుంచి విచ్చేసిన వారికి సమాచారం తెలియజేస్తున్న వాలంటీర్లు

శ్రామిక ఉత్సవ్‌కు విచ్చేసిన కళాకారులు, విద్యార్థులు

మహిళల నృత్య ప్రదర్శన

ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు

మద్యపానం అనర్థాలపై కళారూపం

కళారూపాలను వీక్షిస్తున్న నగర ప్రజానీకం

విప్లవ గీతాలు ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

చైతన్యం రగిలించిన రైస్‌మిల్లు కార్మికుల పోరాటాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రైసు మిల్లు కార్మికుల పోరాటాలు విస్తృతంగా సాగాయి. మందస, కోటబొమ్మాళి వంటి ప్రాంతాల్లో చేపట్టిన పోరాటాలు మిగిలిన ప్రాంత కార్మికుల్లో చైతన్యం రగిలించాయి. పనికి వెళ్తే గానీ పూట గడవని స్థితిలో ఉన్నా ఆయా ప్రాంతాల కార్మికులు నెల రోజులకు పైగా సమ్మె చేసి తెగువ ప్రదర్శించారు. పనిలో నుంచి తీసేస్తామన్నా వెరవలేదు. స్థానిక రాజకీయ నాయకులు బెదిరించినా వెనక్కి తగ్గలేదు. తాము అనుకున్న కూలిరేట్లను పెంచుకున్నారు. తమ పోరాట స్ఫూర్తితో ఇతర మిల్లుల్లోని కార్మికులు ఆందోళనకు దిగాల్సిన పని లేకుండానే యజమాన్యాలు కూలి రేట్ల పెంపునకు అంగీకరించేలా చేయగలిగారు.

మందస ప్రాంతంలోని సారంగిపురం, రామకృష్ణాపురం పరిసర గ్రామాల్లోని రైస్‌మిల్లుల్లో సుమారు వంద మంది కార్మికులు పనిచేస్తున్నారు. రెండేళ్లకోసారి కూలి రేట్ల ఒప్పందాన్ని సవరించాల్సిన మిల్లు యజమానులు ఒప్పంద కాలపరిమితి దాటినా పెంచేందుకు అంగీకరించలేదు. దీనిపై మిల్లు కార్మికులు పలుమార్లు యజమానుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు. దీంతో సిఐటియు ఆధ్యర్యాన ఆందోళనలకు సమాయత్తమయ్యారు. కార్మికులు మానేసినా ఫర్వాలేదనుకున్న యజమానులు వారి డిమాండ్లను అంగీకరించలేదు. దీంతో వారు ఆందోళనలను ఉధృతం చేశారు. కార్మికులకు న్యాయం చేయాల్సిన స్థానిక వైసిపి నాయకులు యజమానుల పక్షం వహించారు. రాజకీయ జోక్యం చేసుకుని కూలి రేట్లు తగ్గించడానికి సైతం ప్రయత్నించారు. అంతా ఏకమైనా వారు తమ పోరాటాలను ఆపలేదు. 2023 డిసెంబరులో 42 రోజుల పాటు సమ్మె చేశారు. దీంతో అధికార యంత్రాంగం జోక్యం చేసుకుని 34 శాతానికి పెంచడానికి ఒప్పుకున్నారు.

బెదిరింపులకు దిగినా వెరవని కార్మికులు

కోటబొమ్మాళి ప్రాంతంలోని రైస్‌మిల్లు కార్మికులు ఇదే తరహాలో పోరాటం సాగించారు. వీరు కూడా 40 రోజుల పాటు సమ్మెకు దిగారు. ఇక్కడ ఏకంగా అధికారులే బెదిరింపులకు దిగారు. కార్మికులపై అత్యవసర సేవల నిర్వహణ చట్టం (ఎస్మా) ప్రయోగిస్తామంటూ ఆర్‌డిఒ సైతం హెచ్చరించారు. బెదిరింపులకు వెరవని కార్మికులు తమ సమ్మె కొనసాగించారు. పరిస్థితి చేయిదాటిపోతుండడంతో కార్మికశాఖ అధికారులు జోక్యం చేసుకుని చర్చలు జరిపారు. రైస్‌మిల్లుల్లో చేసే పలురకాల పనులపై 26 శాతం పెంచేందుకు అంగీకరించాయి. కార్మికుల పోరాట ఫలితంగా కార్మికులకు రూ.4,200 బోనస్ దక్కింది. వేళాపాళా లేకుండా పనిచేయించుకున్న పరిస్థితి నుంచి నిర్ధిష్ట పనివేళల్లోనే పనిచేసేలా ఒప్పందం సాధించుకున్నారు.

డిమాండ్ నోటీసులతోనే దారికొచ్చిన యజమానులు

కోటబొమ్మాళిలో ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

పాలకొండ, రాజాం ప్రాంతాల్లోని రైస్‌మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులు కూలి రేట్ల పెంపునకు సిఐటియు అండతో అనేక పోరాటాలు సాగించారు. పాలకొండ మండలం కొమరాడ, అన్నవరం తదితర మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులకు పీస్ రేట్ పెంపుపై కార్మికులు ఆయా యజమానులకు డిమాండ్ నోటీసులు ఇచ్చాయి. ఆందోళనలకు అవకాశం ఇవ్వకుండా డిమాండ్ నోటీసులతోనే యజమానులు దారికొచ్చారు. పలురకాల కూలి పనులపై 29 శాతం పెంచేందుకు అంగీకరించారు. రాజాం మండలంలోని రాజాం, బలిజపేట తదితర ప్రాంతాల్లోని 22 మిల్లులోని కార్మికులకు పెంపు రేటు ప్రయోజనాన్ని దక్కించుకున్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లోని రైస్ మిల్లు కార్మికులు మిల్లులను స్తంభింపచేయడంతో లేనిపోని రచ్చ ఎందుకని యజమానులు డిమాండ్ నోటీసులతోనే వారి పీస్ రేట్లను పెంచేందుకు అంగీకరించారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడ ప్రాంతంలోని కార్మికులు ఎటువంటి పోరాటాలు లేకుండానే డిమాండ్ నోటీస్ ఇచ్చిన వెంటనే పెంపునకు యజమానులు అంగీకరించారు. మిల్లులో చేసే పని ఆధారంగా 26 శాతం పెంపు రేటు దక్కించుకున్నారు. పోలాకి మండలం పిన్నింటిపేటలో కార్మికులు 26 శాతం రేటు సాధించుకున్నారు.

పోరాటంతోనే నిలబడిన బిహెచ్‌పివి

ప్రజాశక్తి - విశాఖపట్నం

కేంద్ర ప్రభుత్వం 1991లో తెచ్చిన నూతన ఆర్థిక విధానాలతో విశాఖలో బిహెచ్‌పివి కష్టాల్లో పడింది. వర్క్ ఆర్డర్ రాకపోవడం, ఎల్‌అండ్‌టి వంటి పరిశ్రమలు పోటీకి రావడంతో ఈ పరిశ్రమ సంక్షోభంలోకి నెట్టబడింది. కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి దాపురించింది. 1966 జూన్ 25న బిహెచ్‌పివి ఏర్పాటుకు అప్పటి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత 4000 మంది పర్మినెంట్ ఉద్యోగులు, 500 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేసేవారు. నూతన ఆర్థిక విధానాల తర్వాత బిహెచ్‌పివి పరిస్థితి దిగజారుతూ వచ్చింది. పిఎఫ్ లోనులు ఇచ్చేవారు కాదు. కో-ఆపరేటివ్ సొసైటీలు దివాళా తీశాయి. 2001లో సిఐటియు, ఐఎన్‌టియుసి ఫ్రాక్షన్, బిహెచ్‌పివి ఎంఎస్ ఫ్రాక్షన్ కలిసి ఉమ్మడిగా యూనియన్ ఎన్నికల్లో పోటీచేశాయి. గౌరవాధ్యక్షులుగా సిహెచ్.నర్సింగరావు గెలిచారు. ఆ ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావు ఓడిపోయారు. ఈ కాలంలోనే ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కంపెనీలో పెద్ద పోరాటాలు జరిగాయి. కుటుంబాలతో సహా పోరాటంలోకి వచ్చారు. ఆనాడు కేంద్రంలోఉన్న వాజ్‌పేయ్ నేతృత్వంలోని బిజెపి, రాష్ట్రంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వాల నుంచి సహాయం అందలేదు. కేంద్ర ప్రభుత్వం ఎల్ అండ్ టితో బేరసారాలు జరిపింది. బిహెచ్‌పివిని కొనుగోలు చేయడానికి ఎల్ అండ్ టి కంపెనీని అధికారికంగా కేంద్రం పంపించింది. బిహెచ్‌పివిలోకి ఎల్ అండ్ టి కార్మికుల రాకను కార్మికులు వ్యతిరేకించారు. వచ్చిన వారిని వచ్చినట్లుగా కార్మికులు వెంటబడి తరిమికొట్టారు. ఎల్ అండ్ టి అధికారులు పలాయనం చిత్తగించారు. కేంద్రంలో ఉన్న వాజ్‌పేయ్ ప్రభుత్వం ప్లాన్ మార్చుకొని ఎల్ అండ్ టి నుంచి ఒక అధికారిని మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎంపిక చేసి బిహెచ్‌పివికి పంపించింది. వచ్చిన ఎమ్‌డి కర్మాగారానికి వర్క్ ఆర్డర్లు తేకుండా, కార్మికులకు పని లేకుండా కుట్రకు పూనుకున్నాడు. ఎమ్‌డి మోసాన్ని సిఐటియు గుర్తించి మే డే రోజున జెండా ఎగురవేసి, మేనేజింగ్ డైరెక్టర్ గోబ్యాక్ నినాదాన్ని ఇచ్చిది. హైవే నుంచి బిహెచ్‌పివి అడ్మిన్ బిల్డింగ్ వరకు ప్రదర్శన చేసింది. పెద్దపెట్టున నినాదాలతో నిరసన చేపట్టింది. ఎమ్‌డిని బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. అప్పటి నుంచి ఉద్యమం ఊపందుకుంది. కొన్ని నెలలకు ఎమ్‌డి రాజీనామా చేసి వెళ్లి పోయాడు. ఆ సమయంలో దేశంలో ఎన్నికలు వచ్చాయి. రాష్ట్రంలో టిడిపి ఓడిపోయింది. కాంగ్రెస్ గెలిచింది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కేంద్రంలో వామపక్షాల సహకారంతో యుపిఎ-1 ప్రభుత్వం ఏర్పాటైంది. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఏర్పడింది. రాష్ట్రంలో రాజశేఖరరెడ్డి ప్రభుత్వం బిహెచ్‌పివి టౌన్‌షిప్ స్థలం కొంత భాగం అమ్ముకొని

అప్పులు తీర్చుకొని కర్మాగారం నడుపుకోవచ్చు కదా అని సలహా ఇచ్చింది. దీన్ని సిఐటియు వ్యతిరేకించింది. పోరాడింది. సీతారాం ఏచూరి జోక్యంతో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం భెల్‌లో విలీనం చేయడానికి అంగీకరించింది. ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసి 2018 మే 10న బిహెచ్‌పివిని భెల్ యాజమాన్యం టేకోవర్ చేసుకుంది. ఇప్పుడు మహరత్నగా కొనసాగుతోంది. భెల్ 17వ యూనిట్‌గా ఉంది.

బిహెచ్‌పివికి కూతవేటు దూరంలో ఉన్న హిందూస్తాన్ జింక్ పరిశ్రమ 1977 మార్చి నుంచి ఉత్పత్తి ప్రారంభించి బాగా నడిచింది. కేంద్రంలోని వాజ్‌పేయ్ ప్రభుత్వం జింక్ పరిశ్రమను ప్రయివేటు సంస్థ అయిన వేదాంతకు అప్పగిచ్చింది. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా యూనియన్ ప్రతిఘటించినా దీర్ఘకాలం కొనసాగలేదు. ప్రయివేటీకరణ ఫలితంగా ప్రస్తుతం ఆ పరిశ్రమ మూతపడింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

అచ్చయ్యమ్మ (ఫైల్)

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16వ నంబరు జాతీయ రహదారి పైడిభీమవరం పారిశ్రామిక వాడ అపిటోరియా (అరబిందో) పరిశ్రమ ఎదురుగా మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం సిహెచ్.అగ్రహారానికి చెందిన శీల అచ్చయ్యమ్మ (40) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చయ్యమ్మ అపిటోరియా (అరబిందో) పరిశ్రమ క్యాంటీన్‌లో ఎన్ఎంఆర్‌గా పనిచేస్తుంది. ఎప్పటిలాగే ఎఫిస్ట్ డ్యూటీకి వేరొక వ్యక్తి ద్విచక్ర వాహనంలో వచ్చింది. పరిశ్రమలోనికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అచ్చయ్యమ్మ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త అచ్చిరప్పుడు, పిల్లలు ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

మహాలక్ష్మి (ఫైల్)

నందిగాం : మండలంలోని ఉయ్యాలపేట మాజీ సర్పంచ్ కొయ్య మహాలక్ష్మి (72) మంగళవారం మృతి చెందారు. ఆమె కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడి మృతి చెందింది. ఆమె 1995 నుంచి 2001 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. ఆమె హయాంలో తాగునీటి సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారు. ఈమెకు కుమారుడు శ్రీనివాసరావు ఉన్నారు.

విశ్రాంత పశు వైద్యాధికారి మృతి

సుందరరావు (ఫైల్)

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్లాంలోని తన నివాసంలో సోండిల సంఘ రాష్ట్ర కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు తండ్రి, విశ్రాంత పశు వైద్యాధికారి సుందరరావు మంగళవారం మృతి చెందారు. సుందరరావు సేవాభావంతో, నిబద్ధతతో తన వృత్తి జీవితాన్ని సమాజానికి అంకితం చేశారు. ఆయన మృతిపై పలువురు సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సింహాచలాన్ని పరామర్శిస్తున్న శ్రీకాంత్

శ్రీకాంత్ పరామర్శ

మెళియాపుట్టి : మండలంలోని పెద్దపద్మాపురానికి చెందిన బడబంతి సింహాచలం ఇటీవల అనారోగ్యంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తూర్పు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి సింహాచలాన్ని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం ఎక్కడ?

ప్రశ్నించిన సభ్యులు

ప్రశ్నిస్తున్న సింహాచలం
(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు)

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం అమలు అవుతుందా, ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ లారీల్లో వచ్చిన ప్లాస్టిక్, గోదాంలు తణిఖీల్లో పట్టుకున్న ప్లాస్టిక్ ఏమయ్యాయి.... ప్లాస్టిక్ రవాణాకు వినియోగించిన వాహనాలు సీజ్ చేశారా? చేస్తే అవి ఎక్కడ ఉన్నాయి తదితర అంశాలపై కౌన్సిలర్ సనపల సింహాచలం మున్సిపల్ అధికారులను నిలదీశారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన మంగళవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. కుళాయిల ద్వారా ప్రజలకు నీరు అందడం లేదని, దీనికి ఎటువంటి చర్యలు చేపడుతున్నారో సమాధానం చెప్పాలని కోరారు. దీనిపై కమిషనర్ ఇ.శ్రీనివాసులు సమాధానం చెబుతూ వీటి వివరాలు త్వరలోనే అందరికి తెలియస్తామని తెలిపారు. గిరిబాబు మాట్లాడుతూ ఉద్దానం పైపులైన్ల ద్వారా తాగునీటి అందించేందుకు రూ.60 లక్షలకు టెండర్లు పిలిచామని తెలిపారు. దానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో ప్రస్తుతం ఉద్దానం పైపులైన్ల ద్వారా తాగునీరు అందించేందుకు రూ.పది లక్షలు వెచ్చించి నీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దుర్గాశంకర్ పండా, కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

అభ్యుదయం సైకిల్ ర్యాలీకి స్వాగతం

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట : ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, నాయకులు

డ్రగ్స్ వద్దు బ్రో, భవిష్యత్ ముద్దు అనే నినాదంతో పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన అభ్యుదయం సైకిల్ యాత్ర మంగళవారం సోంపేట చేరుకుంది. స్థానిక సిఐ మంగరాజు ఆధ్వర్యాన వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు సైకిల్ యాత్రకు మద్దతు తెలిపారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ యాత్రకు సంఘీభావం తెలిపి డ్రగ్స్ విడనాడాలంటూ పిలుపునిచ్చారు. పట్టణంలోని బస్టాండ్ కూడలి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ... సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తూ, గాంధీ మండపం కూడలి వద్ద సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ లవరాజు పాల్గొన్నారు.

కంచిలి : డ్రగ్స్ వద్దు బ్రో-ఆరోగ్యమే ముద్దు అనే నినాదంతో పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు తలపెట్టిన అభ్యుదయ సైకిల్ యాత్ర మంగళవారం మధ్యాహ్నం కంచిలి చేరుకుంది. యాత్రకు స్థానిక ఎస్ఐ పారినాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు మాదిన రామారావు, కూటమి నాయకులు, వివిధ పాఠశాల విద్యార్థులు అపూర్వ స్వాగతం పలికి, మద్దతుగా నిలిచారు.

కవిటి: మండలంలోని మాణిక్యపురం, బల్లిపుట్టుగ, కుసుంపురం, వరక, బొరివంక, జగతి గ్రామాల్లో అభ్యుదయం సైకిల్‌యాత్ర సాగింది. కార్యక్రమంలో సిఐ చిన్నంనాయుడు, ఎస్ఐ రవివర్మ పర్యవేక్షణ బాధ్యతలు స్వీకరించి, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

యుటిఎఫ్ కేలండర్ల ఆవిష్కరణ

మందస : కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- మందస

యుటిఎఫ్ 2026 కేలండర్‌ను యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు, మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు మంగళవారం ఆవిష్కరించారు. కొత్త సంవత్సరంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు బకాయిపడిన డిఎ, పిఆర్‌సి, ఐఆర్ తదితర ఆర్థిక సంబంధిత సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జయరాం మాలి, పూర్వ కార్యదర్శులు గున్న రమేష్, రాజాన పరమేశ్వరరావు, మందస మండల అధ్యక్షులు జగదీష్ బడిత్య, సహాధ్యక్షురాలు ప్రియాంక మహారాణా, మహిళా కన్వీనర్ సిహెచ్.పద్మ పాల్గొన్నారు.

నందిగాం : మండల యుటిఎఫ్ కేలండర్‌ను ఎంఇఒ జి.నరసింహులు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్షులు కె.కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రంలోని డిజిఎం ఆనంరావు ఎరువులు, పురుగు మందుల దుకాణం, గౌడౌన్ రణస్థలం

ఎరువుల దుకాణం తనిఖీ

ఎడిఎ వి.శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువుల దుకాణం ముందు ఎరువుల నిల్వ, ధరల పట్టికని రోజూ అప్‌డేట్ చేసుకోవాలని ఆదేశించారు. బిల్ బుక్, స్టాక్ రిజిస్టర్‌ని తనిఖీ చేశారు. ఎరువులు ధరలు నియంత్రణ లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి విజయబాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు మండల కేంద్రంలోని మండల స్థాయి సరుకు నిల్వ గోదాం (ఎంఎల్ఎస్ పాయింట్)ను మంగళవారం డిఎస్ఒ సూర్యప్రకాశరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంకు విద్యుత్ లేకపోవడంతో ఇన్‌ఛార్జి వి.రవికుమార్‌పై అసంతృప్తిని వ్యక్తం చేశారు. సరుకుల బరువు తూచేందుకు వ్యవసాయ మార్కెట్ యార్డులో గల వేర్‌హౌసింగ్ గోదాం వద్ద వేయింగ్ వేసి డిపోలకు తరలిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఆయనకు తెలిపారు. అలాగే సిఎస్ డిటీ తిరుపతిరావు పనితీరుపైన, గోదాం కండిషన్ బాగోలేదంటూ అసంతృప్తిని వ్యక్తం చేశారు. మండలంలో మొత్తం 62 డిపోలకు పొందూరుకు 33 డిపోలు, శ్రీకాకుళం 18 డిపోలు, ఆమదాలవలసకు 11 డిపోలు చొప్పున మూడు ఎంఎల్ఎస్ పాయింట్లకు కేటాయించినట్లు తెలిపారు. అలాగే సాంకేతిక సమస్యలు కారణంగా డిపోలు కేటాయింపులో కొన్ని లోటుపాట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

రికార్డులను పరిశీలిస్తున్న సూర్యప్రకాశరావు

పాలనా సౌలభ్యం కోసమే పునర్విభజన

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రజల ఆకాంక్షలు, పాలన సౌలభ్యం ప్రాతిపదికన జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేపట్టామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను సవరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. నందిగాం మండలాన్ని తిరిగి టెక్కలి డివిజన్‌లోకి మారుస్తూ ప్రభుత్వం మంగళవారం తుది నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. దీనివల్ల స్థానికులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రారంభిస్తున్న ఎంపిపి పద్మ

వంటశాల ప్రారంభం

కవిటి: మండలంలోని బెలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన వంటశాలను ఎంపిపి కడియాల పద్మాప్రకాష్ మంగళవారం ప్రారంభించారు. పాఠశాలలో సరైన వంటశాల సదుపాయం లేక విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ఎంపిపి 15వ వార్డు సంఘం, రూ.1,50,000 నిధులతో శరవేగంగా వంటశాల నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడం తమ బాధ్యతని, భవిష్యత్‌లోనూ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మనిచంద్ర ప్రకాష్, రైల్వే బోర్డు మెంబరు రంగా రౌలో, సంతోష్ పట్నాయక్, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ నీలయ్య, మద్దెల ఈశ్వరరావు, ఎన్ని అశోక్, మాజీ సర్పంచ్ నేతాజీ పాల్గొన్నారు.

బోధనకే పరిమితం చేయాలి

టెక్కలి: ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. టెక్కలి మండలం పర్యటనలో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామిరెడ్డితో కలిసి మాట్లాడారు. రోజూ అత్యవసరం అంటూ ఏదో ఒక బోధనేతర పనిచేయిస్తూ విద్యాశాఖను అత్యవసర శాఖగా మార్చారని అన్నారు. ఇది విద్యా వ్యవస్థ పురోగతికి దెబ్బతీస్తుందన్నారు. అనంతరం యునియన్ క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. పొందర అప్పారావు, రోణంకి జ్యోతి, డిల్లమ్మ పాల్గొన్నారు.

ట్రోఫీని అందజేస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్' విద్యార్థుల అద్భుత ప్రదర్శన

టెక్కలి రూరల్ : ఈనాడు ట్రోఫీ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల బృందం అద్భుత ప్రదర్శనతో సూపర్ ఓవర్ విజేతలుగా నిలిచింది. పోటీలంతటా సమష్టి కృషి, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిన ఐతమ్ జట్టు ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఈ టోర్నమెంట్‌లో ఐతమ్ జట్టు సభ్యులు బి.తనూజ్ ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా, పి.జయరాజ్ ఉత్తమ ఫీల్డర్‌గా ఎంపికై ప్రత్యేక పురస్కారాలు సాధించారు. ఈ సందర్భంగా విజేతలకు డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.వి.మురళీధర్, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, డీన్‌లు, హెచ్‌డిలు, పీడీలు ఎస్.లక్ష్మణ్‌మూర్తి, టి.మురళీమోహన్, జె.తేజేశ్వని అభినందించారు.

కానుకలు తీసుకురావద్దు

కోటబొమ్మాళి: 2026 కొత్త సంవత్సరం ఆరంభ వేళ టెక్కలి నియోజకవర్గం నిమ్మాడలోని క్యాంప్ కార్యాలయం నూతన సంవత్సర వేడుకలకు సర్వం సిద్ధం అయింది. వేదిక ప్రాంగణం సందడితో కళకళలాడనుంది. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, క్రమబద్ధమైన ఏర్పాట్లు చేపట్టడం, భద్రతాపరంగా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అభిమానులు తనను కలవడానికి వచ్చే వారు పూల బొకేలు, దండలు, శాలువాలు, కానుకలు తీసుకురావొద్దని మంత్రులు కోరారు. ఆ ఖర్చుతో పేదలకు సాయం చేయాలని, పేద విద్యార్థులకు నోటుబుక్స్, చదువు సామగ్రి అందించాలని పిలుపునిచ్చారు.

కూచిపూడి నృత్యంలో గిన్నిస్ బుక్ రికార్డు

ధ్రువపత్రాలతో లాషికరెడ్డి

ఇచ్ఛాపురం: మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పిలక పద్మావతి, పిలక యాదవరెడ్డి మనవరాలు లాషికరెడ్డి అద్భుతమైన నృత్య ప్రదర్శన చేయడంతో గిన్నిస్ బుక్ రికార్డు సాధించింది. లాషికరెడ్డి హైదరాబాద్‌లో గచ్చిబౌలి స్పోర్ట్స్ స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమి నిర్వహించిన కూచిపూడి కళావైభవం నృత్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. అద్భుతమైన నాట్య ప్రదర్శనతో గిన్నిస్ రికార్డ్ సాధించి పట్టణానికి గర్వకారణంగా, తలమానికమై నిలిచింది. ఈ నృత్య ప్రదర్శనలో 7232 మంది పాల్గొన్నారు. దీంతో ఆమెకు పట్టణ వాసులు అభినందించారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

ఎన్‌జిఒ జిల్లా జాయింట్ సెక్రటరీగా 'కూన'

ఆమదాలవలస : ఎపి ఎన్‌జిఒ జిల్లా కార్యవర్గంలో సచివాలయ ఉద్యోగులకు ప్రాతినిధ్యం లభించింది. మంగళవారం నిర్వహించిన ఉద్యోగుల ఎన్నికల్లో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీగా కూన వెంకట సత్యనారాయణ ఎన్నికయ్యారు. జిల్లాలోని సచివాలయ ఉద్యోగులకు ఇది ఒక సరికొత్త అవకాశమని ఎన్‌జిఒ రాష్ట్ర, జిల్లా నాయకులు పేర్కొన్నారు. ఎన్‌జిఒ రాష్ట్ర చౌదరి పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం జిల్లా కార్యదర్శి చల్లా శ్రీను, సహాధ్యక్షులు వేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల విద్యార్థులకు అవగాహన

లావేరు: యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ ఇండియా లిటరసి ప్రాజెక్టు సౌజన్యంతో మంగళవారం మండలంలోని 13 పాఠశాలలు, కళాశాలలు చెందిన విద్యార్థులకు ప్రభుత్వ కార్యాలయాలు శాఖలకు చెందిన వివిధవిధానాలు ప్రైవేటు పరిశ్రమల్లో విధులు బాధ్యతలు, సరుకులు ఉత్పత్తి తయారు విధానంపై మంగళవారం అవగాహన కల్పించారు. అందులో భాగంగా లావేరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కె.అప్పలసూరి పోలీస్ వ్యవస్థపై వివరించారు. పిహెచ్‌సిలో వ్యాధులపై వైద్య సిబ్బంది వివరించారు. తామాడలోని విజయనగరం ఫుడ్ అండ్ న్యూట్రాసూటికల్ పరిశ్రమలో తయారయ్యే ఉత్పత్తులు, యంత్రాలు పనిచేసే విధానంపై వివరించారు. కో-ఆర్డినేటర్ టి.కరుణాకరరావు, వై.శంకరరావు, ఐ.రాధ, వాసంతి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న పరిశ్రమ సిబ్బంది

వై నాట్ 110 సర్పంచ్‌లు

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది సమయంలోనే నియోజకవర్గంలోని 110 పంచాయతీల్లో పార్టీలకతీతంగా రూ.వంద కోట్లతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేశామని రాష్ట్ర పియుసి ఛైర్మన్ ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. అటువంటప్పుడు ప్రతి టిడిపి కార్యకర్త త్వరలో నిర్వహించనున్న పంచాయతీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషి చేస్తే నియోజకవర్గంలోని 110 మంది సర్పంచ్‌లు విజయం సాధించడం తథ్యమని అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో నియోజకవర్గస్థాయిలో సుపరిపాలన తొలి అడుగు టిడిపి విస్తృతస్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.టి.రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఇటీవల జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షునిగా నియమితులైన మొదలవలస రమేష్, ఉపాధ్యక్షులు ననవల ఢిల్లీశ్వరరావు, కార్యవర్గం నందివాడ గోవిందరావు, వండాన ఉదయ కుమార్, సిమ్మ మాధవి, సీపాన శ్రీరంగనాయకులును సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పేరుకట్ల విశ్వప్రసాద్, టిడిపి ఇన్‌ఛార్జి చంద్రశేఖర్ యాదవ్, డిసిసిబి ఛైర్మన్ శివాల సూర్యనారాయణ, టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్, టిడిపి మండల అధ్యక్షులు నూకరాజు, చావర సుధాకర్, విజయలక్ష్మి, బెండి రామ్మోహన్, తమ్మినేని అప్పలనాయుడు, హనుమంతు బాలకృష్ణ, నాగళ్ల మురళీధర్ యాదవ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

కూటమి ప్రభుత్వం పరిపాలన సక్సెస్

ఎపిటిపిసి ఛైర్మన్ వజ్జ బాబూరావు

ప్రజాశక్తి- పలాస

బాబూరావు

కూటమి ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో సూపర్ హిట్ అయిందని, అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెట్టించామని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. పలాసలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది కాలంలో ఎన్నో ప్రజా ప్రయోజన కార్యక్రమాలతో ముందుకు వెళ్లామని అన్నారు. 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10,900 కోట్లు తల్లికి వందనం చెల్లించి పేద బడుగు కుటుంబాల కళ్లల్లో ఆనందం నింపామన్నారు. 46 లక్షల మంది రైతులకు రూ.6310 కోట్లు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాలో జమ చేశామని చెప్పారు. రూ.2684 కోట్లతో సుమారు రెండు కోట్ల ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశామన్నారు. ప్రతినెలా 1న, సెలవు దినాలు వస్తే ముందు రోజే ఎన్‌టిఆర్ భరోసా పింఛను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆటో డ్రైవర్లకు రూ.436 కోట్లు, 204 అన్న క్యాంటీన్ల నిర్వహణ, మైనార్టీల సంక్షేమానికి రూ.8427 కోట్లు పాస్టర్లకు, ఇమామ్లకు, పూజారులకు గౌరవ వేతనాలు కింద ఇచ్చామని అన్నారు. కార్యక్రమంలో పలాస మున్సిపాలిటీ 31 వార్డు ఇన్‌ఛార్జి కొరికాన శంకర్రావు, యవ్వారి మోహనరావు మాస్టర్, శాసుమాన చంద్రమౌళి, సప్ప నవీన్, డొక్కరి శంకర్ పాల్గొన్నారు.

రైతుల ఇక్కట్లు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని పాయతారి రైస్ మిల్లులో ధాన్యం సేకరణలో సిబ్బంది పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాల నుంచి ట్రాక్టర్ల ద్వారా మిల్లుకు తీసుకొస్తున్న ధాన్యం తీసుకోవడంలో ఎక్కువేవ లేని కారణాలు చూపుతూ బస్తాలు దించేందుకు తీవ్ర జాప్యం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తీసుకొచ్చిన ధాన్యం బస్తాలను దించకుండా అవి సక్రమంగా లేవు కుంటిసాకులు చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని బిర్లంగి తోటూరు పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి, టిడిపి నాయకులు దూపాన సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. మండలంలో ఎక్కడా లేని కారణాలు చూపుతూ తెచ్చిన ధాన్యం కలిగించడం ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఇబ్బందులు కలిగిస్తే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అధికార్లు కూడా మిల్లు వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బారులు తీరిన ధాన్యం ట్రాక్టర్లు

గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న రామారావు

గ్యాస్ కనెక్షన్లు అందజేత

కంచిలి : మండలంలోని నువాగడ పంచాయతీ తుత్తాసాయిలో లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లను టిడిపి మండల అధ్యక్షుడు మాదిన రామారావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని 14 మంది లబ్ధిదారులకు వీటిని అందజేస్తున్నారు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బొడ్డ హరిబాబు, పిలక చినబాబు, వి.రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- కవిటి

2025లో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో పాటు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం-2, ఎన్‌టిఆర్ భరోసా, స్త్రీ శక్తి వంటి సంక్షేమ పథకాల ద్వారా మహిళలు, రైతులు, పేదలకు కొట్లాది రూపాయల సాయం అందించిందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉచిత బస్సు ప్రయాణం, పింఛన్లు, అన్న క్యాంటీన్లు, విద్యుత్ రాయితీలు ప్రజలకు ఊరటనిచ్చాయని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక వసతుల్లో గణనీయమైన పురోగతి సాధించడంతో పాటు పెట్టుబడులు, ఉద్యోగాలు పెరిగాయని, క్రైమ్-డ్రగ్స్ నియంత్రణతో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని చెప్పారు. కేంద్రంతో సమన్వయంతో రాష్ట్రాభివృద్ధి దిశగా ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.

దరఖాస్తుల స్వీకరణ

ఎచ్చెర్ల: ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో పనిచేస్తున్న అభ్యర్థులు ఐటిఐ కోర్సుకు సమాన అర్హత కలిగిన ఎన్‌టిసి (నేషనల్ ట్రేడ్ ధ్రువపత్రం) పొందేందుకు ఆల్ ఇండియా ట్రేడ్ టెస్టు-26 పరీక్ష రాసేందుకు జనవరి 28 లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటిఐ ప్రధానాచార్యులు ఎల్.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి తత్సమానమైన విద్యా అర్హత కలిగి 21 ఏళ్ల నిండిన కనీసం మూడేళ్ల పనిచేసిన అనుభవం ఉన్న అభ్యర్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. అర్హత ఆసక్తిగల అభ్యర్థులు సమీపంలో ఉన్న ప్రభుత్వ ఐటిఐల్లో తమ దరఖాస్తును అందజేయాలన్నారు. దరఖాస్తుతో రీజనల్ డిప్యూటీ డైరక్టర్ విశాఖపట్నం పేరున రూ.500లు డిడిను జతచేయాలన్నారు. అదనపు వివరాలకు ఎచ్చెర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలను సంప్రదించవచ్చన్నారు.

విద్యార్థుల ప్రతిభ

టెక్కలి : ఈ నెల 27, 28 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించిన అంతర్ జిల్లాల నెట్ బాల్ సీనియర్ విభాగం పోటీల్లో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు డి.నవీన్, బి.ప్రవీణ్‌కుమార్‌లు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్ కుమార్, లుక్‌పాల్, పీడీ కోటేశ్వరరావు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

తీరానికి కొట్టుకొచ్చిన సొర చేప

ఎచ్చెర్ల: మండలంలోని డి.మత్స్యలేశం పంచాయతీ కొత్తమత్స్యలేశం సముద్ర ఒడ్డుకు మంగళవారం భారీ సొర చేప కొట్టుకొచ్చింది. స్థానికులు దీనిని గుర్తించి కొన ఊపిరితో ఉన్న దీనిని రక్షించేందుకు సముద్రంలోకి నెట్టే ప్రయత్నం చేశారు. అయితే ఈ చేప అప్పటికే తీవ్రంగా గాయపడటంతో ముందుకు కదలలేని పరిస్థితుల్లో చనిపోయింది. ఈ చేప సుమారు 300 కిలోల పైగా ఉంటుందని స్థానిక మత్స్యకారులు తెలిపారు.

దశాబ్దాల కల నెరవేరిన వేళ

రోడ్డు నిర్మాణంతో ఇసుకలపేట గ్రామస్తుల ఆనందం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని తొగరాం పంచాయతీ పరిధిలోని ఇసుకలపేట గ్రామస్తుల కల దశాబ్దాల తరువాత నెరవేరడంతో అక్కడి ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే... తొగరాం-కొత్తవలస ప్రధాన రహదారి నుంచి ఇసుకలపేట గ్రామం 1.1 కిలోమీటర్ దూరంలో ఉంది. ఈ గ్రామానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు మట్టి రహదారి పైన ఆ గ్రామస్తులు రాకపోకలు సాగించేవారు. స్వాతంత్ర్యం అనంతరం రాష్ట్రంలో పలు రాజకీయ పార్టీలు అధికారం చేపట్టినా ఆ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడం విశేషం. 2018లో అప్పటి ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇసుకలపేటకు సిమెంట్ రహదారి నిర్మాణానికి రూ.90 లక్షలు ఎఐఐబి నిధుల నుంచి మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. ఆ తరువాత శాసనసభ ఎన్నికలు రావడంతో రహదారి నిర్మాణం పూర్తి కాకుండా మిగిలిపోయింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం 2023లో ఎపిఆర్ఆర్‌పి గ్రాంట్ నుంచి రూ.90 లక్షలతో రహదారి నిర్మాణానికి మంజూరు చేయించి శంకుస్థాపన కూడా పూర్తి చేశారు. రహదారి పనులు పూర్తికాకుండానే మిగిలిపోయాయి. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే రవికుమార్ రూ.70 లక్షలను ఎఐఐబి నిధులను మంజూరు చేయించి తారు రోడ్డు నిర్మాణాన్ని మంగళవారం ప్రారంభించి పనులను పూర్తి చేయించారు. ఇసుకలపేటకు రహదారి నిర్మాణం పూర్తి కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి చకచక పనులను పూర్తి చేయించడంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వెంకటరత్నం

రాజీ లేని స్వరాజ్య వీరుడు త్రిపురాన

మాజీ మంత్రి వెంకటరత్నం

ప్రజాశక్తి- అరసవల్లి

మాజీ మంత్రి వెంకటరత్నం స్వాతంత్ర్య సమరంలో వీరోచితంగా పోరాడిన గొప్ప వ్యక్తి త్రిపురాన రాఘవదాసు అని మాజీ మంత్రి డాక్టర్ త్రిపురాన వెంకటరత్నం అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు రాఘవదాసు 104వ జయంతి వేడుకలు గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ తన తండ్రి రాఘవదాసు స్వాతంత్ర్య పోరాటంలోనే కాకుండా ప్రజాజీవితంలో కూడా ఎన్నో ఉన్నత పదవులు నిర్వహించి ప్రజల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. తొలుత గాంధీ, రాఘవదాసు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం విగ్రహదాత డాక్టర్ త్రిపురాన వెంకటరత్నంను, శ్రీప్రగతి మహిళా మండలి అధ్యక్షురాలు కోట సావిత్రమ్మను సత్కరించారు. కార్యక్రమంలో గాంధీర మందిర కమిటీ సభ్యులు నక్క శంకరరావు, ఎం.ఎ.ఎన్.భట్లు, కొంక్యాన మురళీధర్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పిల్లల నీలాద్రి, తెలగ సంఘం నేతలు జి.వి.రమణ పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పాతపట్నం

జెడ్‌పిటిసి లింగాల ఉషారాణి ఆధ్వర్యాన పాతపట్నం నుంచి 500 కుటుంబాలు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు జన్ని అప్పన్న ఆధ్వర్యాన కోదూరు నుంచి వంద కుటుంబాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మాజీ డైరెక్టర్ కనకల కర్రన్న ఆధ్వర్యాన మరో వంద కుటుంబాలు, పోలుబోతు రామారావు ఆధ్వర్యాన 9వ వార్డు నుంచి ఎన్ని తిరుపతిరావుతో కలిసి 20 కుటుంబాలు, హెచ్.గోపాలపురానికి చెందిన 18వ వార్డు సభ్యుడు కోస్ట్ మాధవరావు 20 కుటుంబాలతో టిడిపిలోకి చేరారు. వీరిని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం టిడిపి కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే సీతారాంపల్లికి చెందిన సర్పంచ్ కుమార్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ చక్రపాణి సోయి, ఉప్పాడ దాస్‌రెడ్డి, మరో 8 మంది వార్డు సభ్యులతో కలిసి సుమారు 250 కుటుంబాలు, సరాళికి చెందిన వైస్ సర్పంచ్ యజ్జల లింగమూర్తితో పాటు పది కుటుంబాలు చేరాయి. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న బాబూరావు

కాలువ నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ రైల్వే వంతెన పనుల్లో భాగంగా వర్షపు నీరు రోడ్లు పైకి రాకుండా ప్రజలు ఇబ్బందులు లేకుండా మురుగు కాలువ నిర్మాణంపై శ్రద్ధ చూపాలని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి.విఠల్‌రావు, టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు అన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు మంగళవారం కాశీబుగ్గ రైల్వే వంతెన పనులను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఆర్‌ఒబి పనులను త్వరితగతిన, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ డిఇ కనకరాజు, ఎఇ కిరణ్‌కుమార్, గురిటి సూర్యనారాయణ, జిల్లా పార్లమెంటు వైస్ ప్రెసిడెంట్ గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, సాసుమాన చంద్రమౌళి, కొరికాన శంకర్, దడియాల నర్సింహులు, కొండే నర్సింహులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గార : మాట్లాడుతున్న హరిబాబు

ప్రజాశక్తి- గార

పర్యావరణ కాలుష్యాన్ని నివారించగల చివరి తరం మనమేనని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. మండలంలోని దీపావళిలో పర్యావరణ పరిరక్షణపై న్యాయ అవగాహనా సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యం దెబ్బతింటే మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని పెంపొందించే కార్యక్రమంలో భాగంగా దీపావళిలో ప్రతి ఇంటా వద్ద ఒక మొక్క నాటి, దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రజలు తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలని సూచించారు. కోర్టుల చుట్టూ తిరగకుండా సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అత్యవసర న్యాయ సాయం, సలహాల కోసం టోల్ ఫ్రీ నంబరు 15100కు కాల్ చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ ఎం.సింహాచలం, సర్పంచ్ సిహెచ్.శ్రీనివాసరావు, కార్యదర్శి, విఆర్ఒ పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

పలాస : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పలాస సివిల్ జడ్జి మాధురి అన్నారు. పలాస కోర్టు ఆవరణలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మొక్కలు నాటాలన్నారు. వృక్షం నుంచి వచ్చే ఆక్సిజన్ అత్యంత ఆవశ్యమని, ప్రకృతిని కాపాడుకోనడంలో మొక్కలు చేసే సహాయం అమూల్యమైనదని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్, ఉపాధ్యక్షులు బి.కె.ఆర్. పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ జి.ఎం.ఎస్.అనిల్ రాజు, న్యాయవాదులు ఎస్.నాగేశ్వరరావు, లోకేశ్వరరావు, కె.దేవరాజు, చిట్టిబాబు, సూపరింటెండెంట్ కె.కృష్ణారావు పాల్గొన్నారు.

పలాస : మొక్కను నాటుతున్న జడ్జి మాధురి

చెక్కును అందజేస్తున్న దినేష్

కార్మికులకు బకాయిల చెల్లింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలోని పలు దుకాణాలు, వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాల చట్టం ప్రకారం రావాల్సిన బకాయిలను కార్మికశాఖ అధికారులు రికవరీ చేయించారు. శ్రీకాకుళం ఉప కార్మిక కమిషనర్ కె.దినేష్ కుమార్ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ ద్వారా ఎంపికైన సంస్థల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 22 మంది కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే తక్కువ వేతనాలు చెల్లిస్తున్నట్లు గుర్తించారు. యజమానుల నుంచి రూ.1,07,161 వ్యత్యాస వేతన మొత్తాన్ని రికవరీ చేసి, ఆ మొత్తాన్ని డిడిల రూపంలో బాధితులకు అందజేశారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా చేపట్టిన ఈ తనిఖీల్లో కార్మికులందరికీ అ పాయింట్‌మెంట్ లెటర్లు ఇప్పించడంతో పాటు, వారందరినీ ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయించినట్లు డిఎల్‌సి తెలిపారు.

నిర్వాసిత కాలనీలో మౌలిక సదుపాయాలు

పలాస : మండలంలోని గోపీవల్లభపురం రెవెన్యూ పరిధిలో ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్వాసితుల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పనకు అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. కాలనీలో పాఠశాల భవనం, కమ్యూనిటీ, అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటుకు రెవెన్యూ, పంచాయతీరాజ్, అధికారులు స్థానికులతో సమావేశమయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వాసితుల కాలనీలో పర్యటించి స్థల పరిశీలన చేసి పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. స్థల పరిశీలన చేసిన వారిలో పలాస ఆర్‌ఐ ప్రసాదరావు, పంచాయతీరాజ్ ఇఇ నాగభూషణ్, కార్యదర్శి రవికిరణ్, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

యాత్రికులకు ఇబ్బంది లేకుండా చూడాలి

రణస్థలం రూరల్ : జాతరకు వచ్చే యాత్రికులకు పార్కింగ్, తదితర ఇబ్బందులు లేకుండా చూడాలని జె.ఆర్.పురం సిఐ అవతారం అన్నారు. మండలంలోని కమ్మసిగడాంలో మహాలక్ష్మి తల్లి జాతర జనవరి 27 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. జాతర, పార్కింగ్ ఏరియాలను ఎస్‌ఐ ఎస్.చిరంజీవితో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం యాత్రికుల రాకపోకలు వివరాలు ఆలయ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, కార్యదర్శి మన్నె లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న సిఐ అవతారం

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- నందిగాం

వేరుశెనగ పంటలు వేసే రైతులు విధిగా ఎకరాకు 200 కిలోలు చొప్పున జింక్‌ను వాడాలని ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. మండలంలోని వేణుగోపాలపురంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వేరుశనగ పంటపై ఆశించిన తెగుళ్లు, వాటి నివారణ గురించి వివరించారు. అలాగే రైతు సేవా కేంద్రాల వద్ద నువ్వు విత్తనాలు రాయితీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రెండు కిలోల ప్యాకెట్ 190 బ్యాగ్ అని అన్నారు. అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సోంపేట : మండలంలోని ఇసుకలపాలెం, బెంకిలి గ్రామాల్లో ఎఒ బి.నరసింహమూర్తి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబి పంట కాలంలో వరి సాగులో చేపట్టాల్సిన క్రియాశీలక సాగు పద్ధతులు, వరి నాట్లు సాంద్రత, ఎరువులు వాడకం, కూరగాయల సాగులో వినియోగించాల్సిన రసాయన ఎరువులు మోతాదులు, సస్యరక్షణ, టమాట సాగులో ఆధునిక పద్ధతులను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వాసుపల్లి రాజారావు, ప్రియా ధర్మేంద్ర, మడు మురళి, వ్యవసాయ సహాయకులు ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

నందిగాం : అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీకాంత్‌వర్మ

కిడ్నీ వ్యాధి కబంధహస్తంలో విద్యార్థి

సహాయం కోరుతున్న కుటుంబం

ఆర్థికసాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

కవిటి: కిడ్నీ వ్యాధి నిరుపేద కుటుంబాల జీవితాలను అతలాకుతలం చేస్తోంది. ఆ మహమ్మారి చివరికి విద్యార్థులను విడిచిపెట్టడం లేదు. మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని బిసాయి భూదేవి కొద్ది రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. చిన్నతనంలోనే తండ్రి మృతి చెందడంతో కుటుంబ బాధ్యతలన్నీ తల్లి భుజాలపై పడ్డాయి. ఆమె రోజువారీ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. భూదేవి అక్క ఇంటర్మీడియట్ పూర్తిచేసి, చెల్లెలి అనారోగ్య పరిస్థితి దృష్ట్యా చదువు మానుకుని ఇంటివద్దే చూసుకుంటోంది. మాణిక్యపురానికి సమీపంలోని ప్రధానపుట్టుగకు చెందిన ఈ కుటుంబానికి స్థిర ఆదాయం లేకపోవడంతో వైద్య ఖర్చులు తీరడం కష్టసాధ్యంగా మారింది. ఈ పరిస్థితిని గమనించిన పాఠశాల ఉపాధ్యాయులు మానవతా భావంతో స్పందించి తమ వంతు సహాయంగా రూ.16,200 అందించారు. అయినా చికిత్సకు మరింత ఆర్థిక సహాయం అవసరమని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. చదువుతోనే ముందుకు వెళ్లాల్సిన విద్యార్థిని భవిష్యత్ వ్యాధి కారణంగా అంధకారంలోకి జారిపోకుండా ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కేలండర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రగతి భవనంలో 2026 కేలండర్‌ను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మంగళవారం ఆవిష్కరించారు. వైసిపి జిల్లా సాంస్కృతి విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి ముద్రించిన కేలండర్‌ను పెంచిపెట్టారు. కూటమి ప్రభుత్వ వైఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లానని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రతినిధి శాంతారావు, డోకులపాడు సర్పంచ్ వడ్డి కరుణాకర్, నాయకులు దువ్వాడ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సోంపేట : శ్రీశయన చైతన్య దీపిక 2026 కేలండర్‌ను కోదండ రామస్వామి ఆలయం ఆవరణలో మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైతన్య దీపిక గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎ.వి.రామకృష్ణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవాడ మోహనరావు, దుద్ది వీర్రాజు, కోదండరామ ఆలయ ట్రస్టు చైర్మన్ బీన ఆనందరావు, తడక మాధవరావు, బల్ల జానకిరావు, దూగాన లోకనాథం, బీన ఈశ్వరరావు, పొందూరు రాజు, జనసేన మండల అధ్యక్షుడు బీన ప్రదీప్, ఆణింగి గంగరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఔదార్యం

ఇచ్ఛాపురం : డిఎస్‌సి-25 ద్వారా ఎంపికైన కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రొక్కం రాజ్యలక్ష్మి, ఫర్హానా షేక్, తెన్నేటి దుర్గాభవానిలు ఔదార్యం చాటుకున్నారు. ముగ్గురూ కలిసి రూ.20 వేలు విలువైన ఇన్వెర్టర్లను ప్రధానోపాధ్యాయులు ప్రమిలాకుమారి, ఉపాధ్యాయులు నరేంద్ర నాథ్‌పట్నాయక్‌లకు మంగళవారం అందజేశారు. పాఠశాల అభివృద్ధిలో వాళ్లకు భాగస్వాములుగా చేసినందుకు గర్వంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రామ్మోహనరావు, చంద్రవదన, భాస్కర్‌రెడ్డి, అమిత బెహరా, శ్రీనివాస్ పూండి, మినుచంద్ర, నీలిప్, ఉప్పాడ పాపారావు, కోటేశ్వరరావు, దేవకి, కిరణ్ పాల్గొన్నారు.

ఇన్వర్టర్లను అందజేస్తున్న ఉపాధ్యాయులు

వినతిపత్రం అందజేస్తున్న మీటర్ రీడర్లు

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- కవిటి

ఉద్యోగ భద్రత కల్పించి తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హత మేరకు మీటర్ రీడర్లకు షిఫ్ట్ ఆపరేటర్లు, వాచ్ అండ్ వార్డ్, కంప్యూటర్ ఆపరేటర్, వాచ్‌మెన్, డ్రైవర్‌గా విధుల్లో తీసుకోవాలని కోరారు. మీటర్ రీడర్లకు సంస్థలో ఉపాధి కల్పించి ఎస్క్రో ఎకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మీటర్ రీడర్ల జిల్లా అధ్యక్షుడు బి. ఓంకార్, ఉపాధ్యక్షుడు జె.ప్రేమ్‌భూషణ్‌రెడ్డి, కార్యదర్శి భాస్కరరావు, గౌరవాధ్యక్షుడు లోకనాథం, నీలకంటేశ్వరరావు, సంతోష్‌పండా, రౌలో పూజారి, జి.ఆనంద్, ఎం.హరీష్, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యం

వజ్రపుకొత్తూరు : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే సంస్థ లక్ష్యమని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపకులు తామాడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని సుంకర జగన్నాథపురానికి చెందిన గాడి రాజేశ్వరికి మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. పది నెలల క్రితం ఆమె భర్త చనిపోవడంతో కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇద్దరు ఆడ పిల్లలు చిన్నవారు కావడంతో రూ.పది వేలు నగదు అందించారు. చిన్న పాప పేరున పోస్టల్‌లో నెలకు రూ.500 చొప్పున మూడేళ్ల పాటు డిపాజిట్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు గుంటు విజయ్ మహేష్, బొడ్డు బాబూరావు, మండల ఈశ్వర్, అఖిల్ దండుపాటి పవన్‌కుమార్, చొక్కల శంకర్, కోళ్ల కృష్ణారావు, కర్ని వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న విసి రజని

కేలండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రానున్న నూతన సంవత్సరం వర్సిటీ, అనుబంధ కళాశాలలకు, ఉన్నత విద్యా రంగానికి మరింత శుభసూచికంగా ఉంటూ మరిన్ని ప్రగతి ఫలాలు అందించాలన్న ఆశాభావాన్ని బిఆర్‌ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్. రజని వ్యక్తం చేశారు. 2006 నూతన సంవత్సరానికి సంబంధించి ముద్రించిన కేలండర్, డైరీలను మంగళవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, ఎస్‌ఒ డాక్టర్ కె.సామ్రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.రాజశేఖరరావు, ఎగ్జామ్స్, సిడిసి డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తరలివచ్చిన సందర్శకులు

పోటెత్తిన సందర్శకులు

అరసవల్లి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం అరసవల్లి ఆదిత్యుని ఆలయానికి యాత్రికులు పోటెత్తారు. ఒక దశలో యాత్రికులు తరలి రావడంతో కిక్కిరిసిపోయింది. ఆలయ సిబ్బంది సరైన ఏర్పాట్లు నిర్వహించలేదని యాత్రికులు ఆవేదన చెందారు. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.